అమావాస్య పున్నమి

శ్రీ మునిపల్లెరాజు

1

భూమి బీటలు వారి పోయింది.

అయ్యప్పగారి పెద్దయ్యా, మంచెల కన్నయ్యా వచ్చి, పేడమట్టి అరుగు మీద చతికిలబడి కూచొన్నారు. మామూలుగా, కన్నయ్యను చూడగానే బొడ్లోకి చెయ్యి పోనిచ్చి పొగాకుకాడ తీసి యిచ్చే, జానికి రామన్న గూడా అటు తిరిగి, ఎండి బెట్టలు తేలిన చెఱువువంక చూస్తున్నాడు. భూమి బీటలువారింది. భూదేవి కోపం, దాగి దాగి, ఈనాటికి ప్రళయ సమయంలో పొంగినట్టుగా – బీటలనుండి అగ్గిగాలి లేచి అరుగుమీది వయసు మళ్లిన మనుషులకు తగులుతున్నది. సాయంత్రమయింది. తుమ్మల్లో ఎఱ్ఱగా కాలుతున్నాడు సూర్యుడు. ఆకాశం మీద గూళ్ళకు చేరే పిట్టలేవు. చివరకు తుమ్మల ఆకులైనా పచ్చగా లేవు.

కన్నయ్యా తనకు దగ్గరగా వున్న ముసలి పెద్దయ్యకు చుట్ట అందించాడు. పెద్దయ్యా చూడకుండానే అందుకొన్నాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. చెరువులో తవ్విన ఒర భావినీళ్ళకోసం కేక లేసుకొంటున్న జనం కట్టమీదగా మాగిజిల్లర్లో యిళ్ల ముఖం పట్టేరు. మళ్ళీ నిశ్శబ్దం.

ఉండి వుండి పెద్దయ్యా అన్నాడు, ఎవరివంకా చూడకుండానే –"పాలిచ్చే గేదె ఎండిపోయింది."

కన్నయ్యా చుట్ట కాలుస్తునేవున్నాడు. జానికిరామన్న యిటు తిరగలేదు. పెద్దయ్యా ఆరిపోయిన చుట్ట వెలిగించటానికి నిప్పురాయి కొట్టాడు.

జానికి రామన్న మాట్లాడకుండానే, తూర్పుగా తిరిగి ఆకాశంవంక చూసి, మళ్లీ ఆ కళ్ళనే కన్నయ్యవంకకు పరిచాడు. కన్నయ్యకు ఏమీ తోచనట్లుగా చిరిగిన వుత్తరీయం ఎడమ భుజాన్నుండి కుడిభుజం మీదికి విసిరివేసుకొని – 'ఇంకెక్కడి వానల్లే' – అని తనలో తానుగా గొణుక్కొన్నాడు. ఆ మాటలు మిగతాయిద్దరూ విన్నారో లేదో.

మళ్లీ కొంచెంసేపుగా నిశ్శబ్దం. తుమ్మల్లో సూర్యుడు మాయమైపోయాడు. అగ్గిగాలి ఆగలేదు.

"ఈ ఏటికి మొక్కజొన్నా అంతేలే."

పెద్దయ్యా మాటలు వినకుండానే ఆ యిద్దరూ ఆకాశంవంక చూస్తున్నారు. భయంతో, సిగ్గుతో నక్షత్రాలు తొంగి చూస్తున్నవి. ముసలి పెద్దయ్యా అరుగుమీది నుంచి లేచి "జానికిరామన్నా! యింటికి కంపగొట్టి మేమంతా కడప బోతున్నాం.. కాస్తంత కనిపెట్టుండు" అని అంటూనే నడక సాగించాడు. పెద్దయ్యా నడుస్తుంటే గాలికి కదిలినట్లు ముగ్గుబుట్టల కదులుతున్నది. చెప్పులు తెగి, కిర్రంతా పోయి, మొండి ఆకారం పడ్డవి.

ఇద్దరూ పెదయ్యావంక హఠాత్తుగా చూశారు. తరవాత ఒకళ్లి నొకళ్లు చూసుకొన్నారు. అశుభాలు, శుభాలు ఏమొచ్చినా జానికిరామన్నతో తల గలపందే, ఏపనీ తల పెట్టలేని పెద్దయ్యా, తరతరాలు పుట్టి మెట్టిన ప్రాచీన గ్రామాన్ని వదిలి, ఇంటికి కంపగొట్టి పోతున్నాడా? ఆ మాటల్లోని అద్దంలో ప్రతిబింబంగా కఠినమైన సత్యం, ఎండి గడ్డి మొలక గూడా లేని చెఱువంతటి దుఃఖం – నమ్మలేక కన్నయ్యా జానికిరామన్న వంక మరోసారి చూశాడు.

అవును, రాయలసిమ బీటలు వారింది.

నిశ్శబ్దం. గుంపులు గుంపులుగా ఆకాశంలో ఒంటరి చుక్కలు కూడుతున్నవి. అరుగుమీద కన్నయ్యా కదిలాడు.

"అనంతయ్యా ఎల్లగిత్తనీ, పుల్లెద్దునీ కడప సాయిబులికి తోలాట్ట."

జానికిరామన్న ఆ మాటకు గూడా సమాధానం చెప్పలేదు. జవాబు లేని ప్రశ్నలకు సమాధానం ఏమిటన్నట్లుగా వూరుకొన్నాడు. కన్నయ్యా చుట్ట పారేసి తల గోక్కొన్నాడు. జవాబు రాలేదు జానికి రామన్న నుండి.

మళ్ళీ కన్నయ్యా కదిల్లాడు. పేడమట్టి అరుగు మొగదలరాయి కదిలి, వూడి కింద బడింది.

"రాము లేడే జానికయ్యాన్నా?" ఈ ప్రశ్నకు కొామాలు జానికిరామన్న యిటు తిరిగిచూసింది. చీకట్లో కన్నయ్యా ఆ కళ్లను చూడలేదు.

"ఆఁ...ఆఁ.....రాములా? మాదిగపల్లె పోయాడు."

"ఏం?"

కొంచెం ఆగి—"చూడావు పొద్దున చచ్చింది."

"బసవమ్మ?!"

"చచ్చిపోయింది."

కన్నయ్యా చీకట్లో తలగోక్కున్నాడు. "అవును... మేత లేక..." అన్నాడు గద్గదికంగా.

బాగా చీకటి కమ్మింది. జానికిరామన్న తనకు తానుగా అన్నాడు. "మన చీని తోటలో బావి గూడా ఎండినట్టేరా, కన్నయ్యా"

ఈ మాటు కన్నయ్యా మాట్లాడ లేదు. మాట్లాడక అరుగుమీదినుంచిలేవబోయాడు. మళ్ళీ మట్టిపెళ్ళలు రాలి, రాళ్ళు జారిపోయినవి.

అవును, భూమి బీటలు వారింది. వసంతకాలంలో రాయలసీమ నవ్వి చిగిర్చలేదు. చిగిర్చక ఆకసం వైపు నిస్సహాయతతో చూసింది. చేతులు ముడిచి ప్రార్థనలు చేసింది. మొక్కజొన్న పండలేదు. పాడి గేదెలు తన్నినవి. చూడి ఆవులు చచ్చిపోయినాయి. జానికిరామన్న సెంచయ్యా యింటికాడ నిలిచి, ఆకాశంవంక చూశాడు. సెంచయ్యా బయటకు వచ్చి ముఖం చూశాడు. పెద్దయ్యా, కన్నయ్యా జానికిరామన్న అరుగుమీద చతికిలబడి వెళ్లిపోయారు. పూజారి నంబి క్షేమాచార్లు మంటపంమీదకూచొని, గుళ్ళో ఆరిపోతున్న దీపం వంక చూశాడు. అగ్రహారంనుంచి వచ్చిన శాస్త్రుర్లుగారు- "అమ్మాయి పెళ్ళి ఈ యేటికి గూడా లేదా?" అన్నాడు. మాలపల్లెలో కుక్కలు చచ్చి గబ్బువాసన లేచింది.

పొనకాలు తూర్పున పైగా చూ



★ అమావాశ్య పున్నమి ★

"అదేమిటంటావే...ఆ ఆనలుపూ? మబ్బులేనంటావా పరంద్రాద్యుమావాఁ? పైరు గాలి దిరిగింది, మరి పరమాత్ముడి దయ" అనుకుంటూనే వెళ్లిపోయాడు. మనుషులు మాట్లాడుకొంటున్నారు. కాని ఒకళ్లముఖాలు వేరొకళ్ళు చూచుకునే ధైర్యంతో గాదు.

అవును భూమి బీటలు వారింది. ప్రకృతి శాపంవలె రాయలసీమ బీళ్ళు దేలింది. రాయలేలిన రత్నాల సీమ, చీనితోటల నల్లభూమి, బంగారుగడ్డ, మాసీమ. ఆకలితో లోకం వంక చూసింది, ఆకాశపు కోపం భరించలేక.

2

జానికిరామన్న ఎదురుచూశాడు - ఝామురాత్రి దాకా. రాములు తిరిగి రాలేదు.

"అమ్మా, మాలచ్చీ! బావ జాడ నీకేమైనా దెలుసా?" అని కూతురు నడిగాడు.

"మాదిగపల్లె బోతానన్నే" అన్నది మాలచ్చి. మసిబారిన పాతలాంతరు చేబట్టి జానికిరామన్న వెతకబోయినాడు. మాదిగపల్లె వెళ్ళినమాట నిజమే గాని, చీనితోట వెనక బసవమ్మను పూడ్చింతర్వాత, రాములు జాడ వాళ్ళెవరూ యెరుకలేదన్నారు.

జానికిరామన్న యీడ్చుకుంటూ చీనితోటకు దారి తీశాడు. చీకట్లో బావురుమంటూ తోట, పాడుబడి దేబిరిస్తున్న ఏతాము, ఎండి వలిగి రాలిపోతూన్న కొత్తకంచె. "రాములూ!" రాములు పలకలేదు. దయ్యాలు ప్రతిధ్వనించినట్లు తిరిగి కేక వినవచ్చింది. ఎన్నడూ, ఎప్పుడూ, ఎందుకూ భయపడని జానికిరామన్న వెనుదిరిగి వచ్చాడు. రాములు కనబడలేదు. మాలచ్చి ఏడ్చింది. పాతలాంతరు గూడా చమురు లేక ఆరిపోయింది.

కన్నయ్య పొద్దున్నే అరుగుమీద కూర్చొని వున్నాడు.

"రాములు రాలే" అన్నాడు లోపలినించి వచ్చిన జానికిరామన్న.

"హాఁ! ఏడకు బోయినట్టు?"

పెద్దయ్య, కొడుకు వరదరాజు, కోడలు పార్వతమ్మ, ముసలమ్మ సుబ్బమ్మ, యిద్దరు మనమరాళ్ళు అంతా నెత్తిమీద చిన్న చిన్న మూటలు గట్టుకొని, జానికిరామన్న యింటిమీదిగా కడప బోతున్నారు. పెద్దయ్య ఆగాడు. "నీ యింటికొచ్చిన వర్తా యేంలేదు పెద్దయ్యా" అన్నాడు ముందుకువచ్చి జానికిరామన్న. పెద్దయ్య కళ్లుమూసి తిరిగి తెరిచాడు. చెమ్మదేలి ముసలికళ్లు ముందును నమ్మలేక దుఃఖిస్తున్నాయి. ముసలి పెద్దయ్య నడిచివెళ్ళాడు.

మాలచ్చి పరుగెత్తుకుంటూ వెళ్లి పార్వతమ్మ బుజాన చెయ్యివేసి - "అప్పా! మళ్లెప్పుడొచ్చేది?" అని కళ్ళల్లోకి చూసింది. పార్వతమ్మ ఆకాశం వేపు చేతులు చూపింది.

"మా బావ గనబట్టంలేదు రాత్రికాడ నించీ. కడపలో జాస్తే యింటికి బంపండి పెద్దామా."

సుబ్బమ్మ పెద్దమ్మ, పార్వతమ్మ, వరదరాజులు మాలచ్చి వేపు చూశారు. తిరిగి ప్రయాణం సాగింది.

3

మూడు నెలలు. నాలుగు. ఆరునెల్లు. రాములు తిరిగి రాలేదు.

వానలు కురిసినట్లే కురిసి తిరిగి కోపం వహించినవి. జానికిరామన్న శ్రీశైలం దేవుడికి మొక్కుకొన్నాడు. మాలచ్చిని కన్నయ్య పెళ్లాం గ్రామదేవతకు చద్దిబెట్టమన్నది. కాని జానికిరామన్న చీనితోట దిగాలుమంటూనే వుంది. మాలపల్లెంతా కడుపు చేతబట్టుకొని కోస్తా జిల్లాలు చేరపోయింది. పట్నంనించి మిల్టరీ యింజనీర్లు వచ్చి తోటలో నుయ్యిజాచి పెడిమలు విరిచి వెళ్లిపోయారు. రాములు లేని తోట యింకేం తోట? మాలచ్చి చిక్కి సగమైపోయింది. నిద్రలో నడచినట్లుగా నడుస్తున్నది. "బువ్వ మొకం గొట్టినట్లుగా" ఒంటిపూటగూడా గంజిముట్టటంలేదు. వరదరాజులు వుత్తరం రాయించాడు. ముసలి పెద్దయ్య పేదులతో చచ్చిపోయాడని. ఇంటికి గొట్టిన కంపను గురించే కలవరించాట్ట. కన్నయ్య నానల్లి నమ్మి జొన్నలు చల్లాడు - ఒంటియున్నతోనే అరకదున్ని.

అగ్రహారంనుంచి శాస్త్రులుగారు పంచాంగం చంకలో బెట్టుకొనివచ్చి "జానికయ్యా, యీ ఏడైనా పిల్ల పెళ్ళి తలపెట్టావా? యిక వరుణదేవుడికి దయ గలిగిందిలే."

జానికిరామన్న మంచంమీదినించి లేచి కింద గూర్చొని - "రా..ము..లూ?" అన్నాడు. కన్నయ్యవచ్చి శాస్త్రులుగారికి సంగతి జెప్పాడు. శాస్త్రులుగారు లేచి వెళ్తూ- "ధాతకరువూ, డొక్కలకరువూ నయం జానికయ్యా, అప్పుడు వూళ్లు పాడు బడలేదు" అన్నాడు.

రాములు ఎందుకుబోయినట్లు? ఎక్కడకు బోయినట్లు? జానికి రామన్న ప్రశ్న అడుగుదామని లేచినవాడల్లా కళ్ళనీళ్లు దిరిగి తిరిగి కూలబడ్డాడు. మాలచ్చి వచ్చి భుజంమీద వాలి వెక్కి వెక్కి యేడ్చింది. చీనితోటంతా తానేయై చిందులుతొక్కి, ఏతాం లాగి, నీళ్ళుదోవలు గట్టి, బత్తాకాయలకు సంచులుగట్టి, కొత్తమొక్కలకు ఎరువువేసి, మాలచ్చితో మల్లికార్జునిడిమీద పదాలుగట్టి పంచె ఎగదట్టి, పట్నంనుంచి బొంబాయిరేవుకు బోయే మెయిలు బండికి లగూదీసి, చీని నారింజలు పెట్టెల్లో అమ్మి...రాములు చెయ్యని పనేముంది?"

"నాకంచం తిరగబడ్డది. నా కళ్లు బోయినైరా కన్నయ్యా!" అని జానికిరామన్న ఏడ్చాడు. కరువొచ్చి పెళ్లి వాగాలు పడ్డం - ఈ యేడని, ఆ యేడని, వచ్చే ఏడని, పైవచ్చే ఏడని, రాములనేవాడు - "నా పెళ్లాం నా యింట్లోనే వుందే, కన్నయ్యబాబూ!". కన్నయ్య నవ్వి "ఆరి నీ చిగ్గొయ్య గంద్రా! ఆ మూడు ముళ్ళు బడేందీ మాలచ్చిని పెళ్ళం గిళ్ళం అనేవు గనక. తిరగమాతగరికె గాలిందాకా మా పిల్ల అంటిస్తది." అని భయపెట్టేవాడు. తోటకాడికొచ్చిన పళ్ళసాయిబులు వందకు పావలా ఎక్కువిస్తామన్నా, రాములు వినిపించుకోక, పెద్దగంప నెత్తినేసుకొని మెయిలువేళకు చద్దిబువ్వ దిని పరుగులు దీసేవాడు. "మావాఁ చేస్తే రైల్లో వుద్యోగమే జెయ్యాలే" అనుకొంటూ జేబులు గలగల్లాడించుకొంటూ యిల్లు జేరేవాడు. "నువ్వు జదివిన చదువుకంత్రా" అని జానికయ్య.

"ఓస్నీ. యింజేను నడిపేందుకేం సదువులా."

మాలచ్చి మామ అల్లుళ్ళవరస విని నవ్వుకొనేది. అమ్మానాన్న కరువైన రాములూ తల్లి లేని మాలచ్చీ - నువ్వు చిలకంటే, నువ్వు చిలకని పెరిగారు.

* * *

కరువు ముదిరి, చీనితోట చింతలపాలు కాగానే రాములు కొమ్మలు విరిగిపోయినై. రైలుదాకా బోయి ఒట్టికళ్ళతో బొంబాయినించి వచ్చి బోయే ప్రయాణీకుల్ని చూస్తూ, తిరిగి యింటికొచ్చి, కాళ్ళు నిలవక తోటదాకా బోయి, బావిలో తొంగిచూచి, నిస్పృహతో ఏతాం వూపి జాచి, మంటపం దగ్గర దిగులు కబుర్లు విని...ఏమిటీ జీవితం? ఈ బతుక్కి ఏమని అర్థం? తరిగి మురిగి మిగిలిన జొన్నలు మూడు పంచాలకు దిగడినై. జానికిరామన్న

వంక రాములు ఒకటి రెండుసార్లు చూశాడు.

"కడపలో ముఠాలకు పని దొరికిందట"

"ఏం పని?" అని తిరిగిచూశాడు జానికయ్య.

"ఫేక్టరీలో."

"నమ్మకురా"

"జొన్నలయిపోతున్నై...మామా!"

"అందుకని పుట్టినగడప వదిలిపెట్టామంటూ...రాములూ?"

"సద్దామంటావా?..."

"చచ్చేదెందుకు? ఎన్ని కరువులు సూళ్లేదురా, రాములూ? మా తాత డొక్కల కరువులో జచ్చాడు. మా అయ్య ధాత కరువులో జచ్చాడు. అందుకని నమ్ముకొన్న నేలనా వదిలేది?"

"గుంటూరు పోయిన జనం వుప్పుగంజో తాగి బదకటం లేదంటే?"

"భూమి పోయింతర్వాతనంటరా బదుకు రాములూ? బలుసాకు తిని బదకటం బదకటమేనా? ఈ బదుక్కి ఏమున్నా వుంటే ఈ నేల్లో వుంది. ఈ నేలకోసం పుట్టాం. ఈ నేలను నమ్మాం. నమ్మిన వాళ్లకు నాశనం లేదు."

"మీ తాత? మీ అయ్య..."

"వాళ్లు మనుషులు."

ఆమాట తర్వాత రాములు నోరు మెదపలేదు. దిగులుగా కూచున్నాడు. ఆ పొద్దు రోట్లో మాలచ్చిమికి సాయిదాగా జొన్నల్లో పోటు వేశాడు. బసవమ్మ మేతలేక చావగానే, మాదిగపల్లెకు పోతానని పోయాడు. పోయేటప్పుడు — మాలచ్చిమి, బావగడ్డం పుణికి — "కోపమా?" అంది. "ఊహూఁ" అన్నాడు పిల్లాడు. మాలచ్చిమి నవ్వుకొంది. రాములు నవ్వలేదు. తిరిగి కనబడనూ లేదు. ఆరు నెల్లయింది.

4

కొండలమీద వానలుకురిసి వాగులోకి, యీనాలుగేళ్లకుగాను మొదటి సారిగా కొత్తనీళ్లు వచ్చినై పాత జమ్మి, దుబ్బుగడ్డీ, ఎండు తాటివిత్తులూ, గులకరాళ్ళూ కొత్త నీళ్ళతో కొట్టుకువచ్చినై. కన్నయ్య చెరువుకు గండికొట్టి వాగునీళ్లు నింపేందుకు పది మందినీ పోగుజెయ్యటానికి వూళ్లోకి పోయాడు. కన్నయ్య చిన్నకొడుకు గండికొట్టే చోట చొక్కా లేకుండా నిలబడి వాగులో ఒంద్రునీళ్ళనుండి దుబ్బుగడ్డి లాగుతున్నాడు.

"ఊస్స్...రాములన్న!"

కట్టమీదికెక్కి, కొత్త పైపంచె ఎగ్లాజేసుకొని నవ్వుకుంటూ నడుస్తున్న సన్నకారు మనిషి రాములు.

కన్నయ్యకొడుకు నాగేంద్రం, చేతిలో తడి దుబ్బు వాగునీళ్ళలో పారేసి, కొత్తగా వచ్చిన బలంతో జానికిరామన్న యింటికి బరిగెత్తి, గుక్క తిప్పుకోకుండానే "వచ్చాడు మాఁవా! నిజం! సత్తెం! వచ్చాడు! నేం జూస్తే!" అని దబాయించసాగాడు.

అప్పటికి జానికిరామన్న మంచాన బడి నెలదాటిపోయింది. కొంచెం మూలిగి జానికయ్య "ఎవ్రురా, నాగేంద్రం" అని అనగలిగాడు.

"ఎవరేందే? రాములన్నైతే."

మాలచ్చిమికి యీ మాటలు వినబడి పైట సర్దుకొంటూ పరుగుదీసింది. ఆ మాటలంటుండగానే పెద్ద అంగల్తో రాములొచ్చాడు - పెళ్ళలు విరిగిన అరుగులు జూస్తూ. మాలచ్చిమికి మూర్ఛ వచ్చినంతయింది. కన్నయ్య కొడుకు నాగేంద్రంకు అణా "బక్షీసు"లు దొరికినై. ఊరంతా గప్పుమంది.

* * *

శాస్తుర్లుగారొచ్చి లగ్గం అన్నాడు. కన్నయ్యన్నట్లుగా మూడు ముళ్లు వేస్తానన్నాడు రాములు. అంతే గారెలబుట్టలో బడ్డాడు రాములు.

"అరి చిచింద్రిగా! కబురు లేకండా పోయినావ్! మీ మాఁవ జచ్చినంత పనయిందిగందా" అని కన్నయ్య సంతోషంతో కసిరాడు రాముల్ని.

"రైల్లో గేటుకాడ పనయిందే, చిన్నయ్యా"

"అనుకొంటినే అనుకొంటిరా! యాడా చెప్పినావు గాదు."

"పట్నంకాడ కొత్త చీమెంటు పాక్టరీ గడుతుంద్రే అడనే, గేటుకాడ."

"జీతం మాట."

"నలభై"

"నీ తస్సాదియ్యా."

రాములికి పెళ్లయింది. మాలచ్చిమి మూడు ముళ్ళేసుకొని రాముల్ని జానీ తొలగిపోతున్నది పిల్ల. 'జానికిరామయ్య - "యీయేటిగ్గూడా చితికినట్టే. వచ్చేనాటికి" అన్నాడు మొదట్లో. "డబ్బుకు జాపద్దే మావా" అని సంచీ చూపించాడు రాములు. "తొందర" అన్నాడు జానికయ్య. "వుద్యోగం పోద్ది" అని రాములు. రాములికి పెళ్లయింది. వాగునీరు చెరువుకు బెట్టారు. కన్నయ్య మళ్ళీ జొన్నలు జల్లాడు. భూమి మీద బీటలు మూసుకున్నై. అగ్గిగాలి చల్లారింది. రాయలసీమ గూడా నవ్వింది.

"చెలవై పోయింది" అని రాములంటుండగానే, జానికిరామన్న, చిక్కి, ఖేదుల్తో నగమై, కళ్లలో ప్రాణం బెట్టుకొన్నవాడు— కొయ్యబారిపోయాడు. "చీనితోట... రా...ము...లూ" అంటూ ప్రాణం బోయింది. కన్నయ్య వచ్చి తల్లకింద దీపం బెట్టాడు.

పెద్దదినం అయిపోగానే, చీనితోటను బేరానికి బెట్టినాడు రాములు. "దమ్మిడీ రాదు. పాడుబడింది. చుద్ద దండగ" అంటూనే కోమటి సీతయ్య తోటను నాలుగో వంతుకు కట్టుకొన్నాడు. తోటనమ్మి, జానికిరామన్న దినం అయిపోగానే రాములు, పట్నం బయట కొత్త సిమెంటు ఫేక్టరీ దగ్గర్లో, రైలు క్రాసింగు మీద గేట్లుమూసి, లారీలను, జనాన్ని, గేదెల్ని పల్లెటూరి బళ్లనూ, రైళ్లకింద బడకుండా రక్షించను వెళ్లిపోయాడు. కొత్త మాలచ్చిమి వుద్యోగస్థుడి భార్యగా వూరు విడిచింది. తండ్రీ, తోటా లేని వూరు.

5

వంకర్లు తిరిగి తిరిగి పట్నంరోడ్డు రైలు పట్టాలకడ్డం వచ్చింది. ఆ రైలు రోడ్డు క్రాసింగు దగ్గరే రాములు గేటు. గేటుకు తూర్పుగా అరఫర్లాంగులోనే గుజరాతు మార్వారీ సేఠు కట్టించిన కొత్త సిమెంటు ఫ్యాక్టరీ. రైలుపట్టాలకు పది గజాల్లోనే రాములు-రైలుయిల్లు. కొంచెం తలెత్తితే పట్నంలో మేడలు, కోర్టులు, సినిమాలు - మాలచ్చిమికిగూడా కనబడేవి. ఒక పక్కనుంచి, ఇంకోపక్కన మిల్లు కూలీలు గట్టుకొన్న ఎగుడుదిగుడు గుడిసెలు, పాకలు, రిక్షావాళ్ళ అద్దె పూరి కొంపలు. దూరంగా ఒక్క జువ్విచెట్టు, యింకెన్నుంచి పొగబొగ్గుమసి, రోడ్డుమీది నుంచి కార్లు, లారీల దుమ్ము - మాలచ్చిమికి కావలసినంత చాకిరి. రాత్రిం బవలు సందడి.

రైలింట్లో కొత్తగా కాపరం బెట్టినరోజున, కొత్తకుండ పొయ్యిమీద బెట్టొండగా మాలచ్చిమికి, గేటువిూది గంట గణగణా వినొచ్చింది. రాములు ఆదరా బాదరా లేచి, నీలి చొక్కా తగిలించుకొని, పచ్చజెండా ఎర్రజెండా చంకలో బెట్టుకొని, ఉప్పె

(52-వ పేజీ చూడండి)

పరిణామశాలలకు ప్రత్యేక ట్రటుమెంటు చేయబడును. మీ లక్షణములను వ్రాసిపంపండి.

వివరములకు:

తోలేటి ఆంజనేయులు
& సన్

మారుటేరు :: ప. గో. జిల్లా.

★ అమావాశ్య పున్నమి ★

(9-వ పేజీ తరువాయి)

వస్తే వెళ్ళి లారీలు పోతున్నా లక్ష్యం చెయ్యక గేట్లు దబాయించి మూసేశాడు. లారీ డ్రైవర్లు హారన్లు కొట్టారు. తనకుగాద న్నట్లుగా రాములు అటు తిరిగి గూడా జూడలేదు. ఇంతలోనే రైలు వచ్చింది- పెద్దకూత కూసి. మళ్ళీ గేటుమీది గంట. రాములు గేట్లు మూసినవాటిని తెరిచేశాడు. మాలచ్చి భయంతో వణుకుతూ యీ చర్యంతా చూసింది.

"చూశావా, ఎక్స్ప్రెసు"

"ఏడకి బోద్ది?"

"కలకత్త"

"ఆఁ"

"మరేం దనుకొన్నావ్?"

"మరి ఆ లారీవోళ్ళు అట్లా అరగంట నిలబడ్డారే. ఆళ్ళకు కోపం వస్తే"

"అస్సి. ఆళ్ళ కోపం? మనం రాజు లనుకో ఆ కాంతసేపు."

మాలచ్చి భయం పోయింది. ఆ లారీ వాళ్ళకు దమ్ములేవు. రాములు నీలి చొక్కా, పచ్చ జెండా జూడగానే వాళ్ళ యింజన్లు ఆగిపోవా, మరి?

మళ్ళీ యింకో బండి. పెద్దది. జనం లేని ఘోషా పెట్టెలు. "మాల్ గాడీ" అన్నాడు రాములు.

"ఏడకు బోద్దో..."

'ఏడకంటా...ఓస్సి...ఒక దిక్కేంటి? నాగపోర్, డిల్లీ, డేరాడూన్...'' తన అబద్ధాలకు తనే లోలోపల నవ్వుకొన్నాడు రాములు.

"నిజం?'' అంది పెద్దకళ్లు చేసుకొని మాలచ్చి.

"నిజం!'' అన్నాడు చిన్న కళ్ళ రాములు.

* * *

మాలచ్చికి కొత్తపోయింది. కొత్తతో వింతగూడా. నిద్రబోతూనే రైలుకూతలు వినాలి. రాములు ఆదుర్దాతో తిండి తింటాడు. నిద్రగూడా కునికిపాట్ల నిద్రే. గంట మోగితే ఉలిక్కిపడి లేచి వెళ్తాడు. ఎక్స్ప్రెసు, మెయిలు, గూడ్సులు, పాసెం జర్లు వస్తగా రాక్షసి బొగ్గుతో యిల్లంతా బూజుగొడుతూ, తిండిలో బొగ్గు లేరు కొంటూ!! మాలచ్చి మంచిమంచి వంట కాలు చేసి రాములికి పెట్టింది. ఇక్కడ చల్ల చుక్క గూడా కొనుక్కోవాలి. అర్ధణా ఇడితే గిద్దెడు నీళ్లు రాలేదు. రైళ్లకూతలకు తోడు, సిమెంటు ఫ్యాక్టరీ సైరెన్లు. ఇది సందయినపుడు అది కూస్తుంది. చెవులు చిల్లులు పడతాయి. మాలచ్చికి ఒక్కోసారి యేడుపొచ్చేది. పొద్దున్నే లేచి, తిరిగినిద్ర బోయిందాకా, నిద్రలో, తెల్లవార్లూ యీ కూతలు వినాలి. అర్ధణా పెట్టినా గిద్దెడు చల్లచుక్క రాలనిదేశం. కరువులోగూడా వాళ్ల వూళ్ళో చల్లమ్ముకొన్న గర్భాత్రపు అమ్మలేదు. రాములుగూడా మాలచ్చికి కొత్త వదలగానే, యింటిసంగతి మరిచి పోయినాడు. మొదట్లో అయితే యింత ముడిజేసి యింటివెనక వంగలు వేసింది మాలచ్చి. కాని గేట్లు మూసినప్పుడు లారీ డ్రైవర్లు బీడీలు కాల్చుకుంటూ దిగి, వంగ తోటను ధ్వంసం చేశారు. రాత్రిళ్లు మిల్లు కూలీ జనం మిగతావాటిని ఒకటి అర కాయ బడితే దొంగిలించారు. ఎంత ఎదురుజూసినా, బొగ్గుదుమ్ము కళ్లతో గంటల గణగణా రైళ్ళ కూతలూ, సిమెంటు ఫేక్టరీ సైరన్లూ ఎన్నిసార్లు తిరిగి తిరిగి లెక్కించినా మాలచ్చికి పొద్దుపోయేది గాదు. రెండు పొట్టల వంట యింతలోనే అయి పోయేది. అయిపోయిం తర్వాత? రాములు నీలిచొక్కా గుండీలు తెగిపోతే కుట్టేది. గుండీలు రోజూ తెగవి కావు. మాలచ్చి రాములుకోసం కూచునేది. రాములు, పట్నం కబుర్లు జెపితే యింతలోనే అంత పొద్దు కూలేది. కాని రాములు కొత్తగా నేర్చుకొన్న బీడీలతో, ఫేక్టరీవాచిమన్లను పిలిచి గప్పాలు గొట్టుకొంటున్నాడు.

* * *

మాలచ్చి వచ్చింతర్వాత రాములు సెలవ దీసుకోలేదు. ఒక రోజున—"మాలచ్చీ, పట్నం బోయి యియ్యాళ యింటిసామాను దెస్తాను. సాయంత్రం సెలవు మీద బోతాను'' అన్నాడు. తన్ను గూడా రమ్మంటాడని మాలచ్చి మునివేళ్ళమీద కూచొంది. రాములు అన్లేదు.

మాలచ్చి ఒంటరిగా రైలింట్లో నల్ల బారిన పెంకుకప్పు జూస్తూ మంచంమీద పడుకొంది. రాములు పోట్లో గేట్లుమూసేం దుకు పట్నంనుంచిగామూలు యింకో మనిషి వచ్చాడు. ఎక్స్ప్రెసు పోగానే ఆ మనిషి, కోరగా మీసాలు దువ్వు కుంటూ వచ్చి — మంచినీళ్ళడిగాడు. మాలచ్చికి ఆ చూపు నచ్చలేదు. "మా వూ రయితేనా? నడ్డిమీద వడ్డించేదాన్ని'' అని అనుకొంటూనే నీళ్ళందించింది. నీళ్లుతాగి, కోరమీసాలు పోకుండా నిలబడి ఆమాటా, యీమాటా అడిగాడు. ఆమాటలకు మాలచ్చి సిగ్గుపడింది. కోపం వచ్చింది. ఈ బస్తీవాళ్లు మంచివాళ్లు గాదు.

రాములు అర్ధరాత్రికిగాని రాలేదు. "బయస్కోపు కెళ్లిసాం. తమిళం. ఓస్సి. మంచికత్తిసాములే-" అంటూ మాలచ్చికి సామాన్లం దించాడు. మాలచ్చికి వళ్లు మండింది.

అన్నం పెట్టి "ఆ మనిషి మంచోడు గాదు" అంది - మాలి అటు తిప్పుకొని.

రాములు ముద్ద నోట్లో కుక్కుకుంటూ - "ఓస్సి - ఆడు మంచాడు గాదని నువ్వ నాలి. ఆడుగాదా సాకీడవుద్దోగం వుందని జెప్పింది మొదట్లో. ఆడికి తెలుగురాదులే. అరవపోడు'' అని ముగించేశాడు. రాము లికి అర్థంకాలేదు. మాలచ్చి అర్థం విరిచి చెప్పలేకపోయింది. రైళ్ళకూతలమధ్యనే నిద్రవచ్చింది.

వచ్చేవారం రాములు మళ్ళీ వెళ్ళాడు పట్నం.

"యివ్వాళ యారి మొగం జోశానో''. అనుకుంటూ తిరిగి వచ్చాడు.

"ఏమయింది?"

"అయిదు రూపాయలు నష్టం"

"పో...యిందా?" అని మాలచ్చి భయ పడింది.

"ఓస్సి...నీకేం దెల్సు పట్టాలో గట్టి సాం నేనూ ఫేక్టరీ వాచిమేను గల్సి. పులుసులో గలిసిపోయింది."

"—మ...రి..."

"మరీ లేదు గిరీలేదు" అని చికాకుగా అన్నాడు చివరకు రాములు. మాలచ్చి మాట్లాడలేదు. వణుకుతున్న చేతుల్తో రైలు దీపం ముట్టించి రాములుచేతి కందించింది. మాలచ్చికి రాములుదగ్గర వాసన గొట్టింది.

6

ఆ పైసెల్లో మాలచ్చికి దమ్మిడీ యివ్వ లేదు రాములు.

"జీతమంతా అయిపోయింది...ఖలాస్" అన్నాడు.

మాలచ్చితో గొల్ల చల్లమ్మి పోట్లాడింది. ఒకపూట తిని, పాతగుడ్డలు ముందరేసుకొని కుట్టుకుంటూ కూర్చొన్నది. సాయంత్రం రాములొచ్చి "నీకంటె యిటు దేవే మాలచ్చీ" అని చెయి జాపాడు. చీనితోట అమ్మగా వచ్చిన రొక్కంతో కొనుల కంటె జేయించుకొన్నది మాలచ్చి.

"ఎందుకో?"

"పనుంది. యిటుదే?"

"నే నియ్యను. మా అయ్యసొమ్ము." అంది మాలచ్చి. మాలచ్చి చేతులు యే ప్రయత్నం చేయకుండానే మెడలో కంటెను గట్టిగా లంకించుకొన్నవి. ఎందుకు

కంటె అడిగాడో మాలచ్మికి తెలుసు. నిన్న సాయంత్రమే ఫేక్టరీ కొత్త వాచిమేను పెళ్ళాం చెప్పింది. అయ్యలంతా గలిసి పత్తా ఆడుతున్నారంట.

రాములు ఒకడుగు ముందుకొచ్చి "నీ పాణం దీస్తా. జాగర్త. ఒళ్లు గాపాడుకో" అని బెదిరించి వెళ్లిపోయాడు. రాములన్నం దినలేదు. మాలచ్మి దిగులుతో, భయంతో జువ్విచెట్టు కింది కెళ్లి కూచొంది. ఎవరితో చెప్పుకొంటుంది? ఈ బస్తీజనం నిద్రలేచింది లగాయితు ఎవరి బదుకు వాళ్లు చూసుకోటాని కలవాటయి పోయినారు. పక్కింట్లో హత్య జరుగుతున్నా పట్టించుకోరు. కొత్త వాచిమేను పెళ్ళాం, తన లాగా పల్లెటూరునుంచి వచ్చినపిల్ల. కాని వాచిమేను జూస్తే కోపతాడు.

సీకట్లో పొలెం డొంకలో తల విరబోసుకొన్న పొడుగు దయ్యంవలె జువ్విచెట్టు నిల్చివుంది. ఎందుకు తనిక్కడికి వచ్చింది? చీనితోట, రాములుబావ, బసవమ్మపాలు, చెరువునీళ్లు, ఏతాము, నాయన-ఏసీ, ఒకనాడు మురుసుకొన్న యీ సొమ్ములు? వీటికి బదులు పీడకలతర్వాత భయంలాగా సైలుకూతలు, దుమ్ము, ఫేక్టరీ సైరెన్లు, లారీలకంపు, నల్లగా మసిబారిన కొంప, ప్రాణం దీస్తానని బెదిరిస్తున్న మొగుడు. ఆలోచనలతో మాలచ్మివణికి, జువ్విచెట్టు నీడను గూడా జూడలేక, కన్నీళ్లు తుడుచుకొన్నది. బావ వుద్యోగం అంటే ఏమిటో నమకొని కన్న కలలు, యిప్పుడు యీ ఆకలి, రోగం, నిరాశ ముందు బలి ఆయిపోయినాయి. బావజూదం ముందు పాతకలలు. మాలచ్మి కన్నీరబడ్డవి. తోటలో నిమ్మనీడకింద చాకిరినొప్పులన్నీ మరిచి, బావతల్లో పేలు జూసిన మాలచ్మికి తనకేనా బావను జూస్తే ప్రాణభయం? ప్రభలుగట్టే రోజున బావకు తలంట్లుబోసి, కొత్త పంచెలుగట్టబెట్టి, కుంకం బొట్టు కల్యాణంగా బెట్టి, శ్రీశైలం సాగనంపిన తననేనా, బావ "జాగర్త, ప్రాణం దీస్తా" నన్నది? కలలో, పనిలో, ఉవలో, నిశలో తన బావ రాములు ఒకనాడు. మరిచి, విరిచి మాట్లాడే యీ బావ రాములు? తన చెప్పులు మోసి, తనను నీడ గూచోబెట్టిన పాత బావలో యీ రాక్షసు డెట్లా వుద్భవించాడు?

* * *

మాలచ్మి వెళ్ళి బావను వెతకింది. రోడ్డు పక్క ఇనపకమ్మీలమీద గూచొని సైలుకట్ల మీదికి గులకరాళ్ళు విసురుతున్నాడు తదేక ధ్యాసతో. మాలచ్మి ముందునిలిచి, తన కంటె తీసి బావ ఒళ్లో నెమ్మదిగా వుంచింది.

"కంటె గావాలంటివే?"

రాములు నమ్మలేదు బిత్తరపోయినాడు. మాలచ్మివంక చూడబోయి కళ్ళు వాల్చుకొన్నాడు.

"వద్దు..." అనగలిగాడు చివరకు.

"కావాలని...?"

రాములు-తనలోని మానవుడివైపు, రాక్షసుడివైపు చూచుకొన్నాడు.

"ఈ ఒక్కసారి ఆడతా. వాచిమేను జెబుతున్నాడు. ఆడికి అంకె దల్సిందంట. మన పోయిన డబ్బుతో అంతా రావాలి. నీకు చీరెలు దెస్తా మాలచ్మి. ఓస్సి-నవ్వావులే...అద్దిగో...నవ్వినావులే."

రాములు డ్యూటీ అయిపోగానే మాయమై తెల్లవారుఝాము కొచ్చి తలుపు దట్టాడు. మాలచ్మి లేచి వట్టిచేతుల రాముల్ని చూసింది. బావిదగ్గర మొదట్లో కొట్టిన సారాకంపు గొట్టింది.

మాలచ్మి కంటెసంగతి అడగలేదు. కాని తన మూగత్వాని కది అవమానంగా పెంచుకొనాడు రాములు. మాలచ్మికి తన్నులు దప్పలేదు. మట్టిగాజులన్నీ చిట్లిపోయినై. తలమీద బొప్పులు గట్టినవి.

మళ్ళీ కొద్దిరోజులు రాములు మారిపోయాడు. జీతం రాగానే మాలచ్మికి రవిక గుడ్డలు కొన్నాడు. కన్నయ్య చూడనొస్తే మంచి మర్యాద జేశాడు.

మాలచ్మిని మంచి జేసుకోబోయి—"రైలోళ్ళందరు సమ్మె గడతారంట. ఆ గౌదవల్తో నేం గల్సేదిలేదు" అన్నాడు ఒకరోజున.

"ఆళ్ళందరూ ఎదవలేనా?" అని మాలచ్మి అమాయికంగా అడిగింది.

"కాక మరి?"

కాని సమ్మెరోజున తనుగూడా రేటు వదిలి పొయ్యాడు. సమ్మెలో రాములుద్యోగం పోవాలని మాలచ్మి మొక్కుకుంది. ఈ దరిద్ర వుద్యోగం బోతే మళ్ళీ వూరుజేరి, చిన్నతోటేసుకొని, పాత రోజులు అనుభవించవచ్చు. కాని సాయంత్రానికల్లా సమ్మె లేదని తెలియవచ్చింది.

* * *

రాములు జూదాలకు పోవటంలేదు; కాని రోజురోజుకూ బస్తీమనిషైపోయాడు. మాలచ్మికి రవికలు గొన్నాడు, మనసు కొనలేదు.

మాలచ్మి యింటి దిగులుతో కుంగిపోయింది. ప్రకృతిని పిలిచింది. సైలు దుమ్ము, ఫేక్టరీ కుళ్ళులో జీవితమంతా మురిసై మురిగిపోగా, తనబావ జూదరై, పలకరించే దిక్కు లేక! హృదయమిచ్చి మాట్లాడే మనుషులేరు. తను చీనితోటలో ఏతాం సంగతి చెప్పితే అర్థంజేసుకోగల ఆప్తులేరు. చెట్లూ, డొంకలూ, వాగూ, చెరువూ, చీని తోటలూ, చిన్ని గూడల చెంగణ పొద్దుసన్న పిట్టలూ, ఎద్దుల మె మువ్వలూ, హరిదాసు కీర్తనలూ, గొ మ్మలూ, లేగడి పెరుగూ—యిక్కడే డున్నై? వాటి నెప్పుడైనా చూ పొంది ఆనందించిన వాళ్ళొక్కళ కన్పించలేదు మాలచ్మికి.

మాలచ్మికి ఎక్కడా దగ్గర్లో దేవుడి కనిపించలేదు. తమ వూళ్ళో పూజారివ నంబినామాలూ చూడలేదు...యిక్క కొచ్చింతర్వాత. పండగలకి యిల్లం పాటిమట్టి పూతబూసి, ముందంగా పేడ అలికి ముగ్గులు బెట్టటాని కిక్కడేముంది

పార్వతమ్మదినా, ముత్యాలు గా నూరీడు, కవల పిల్లలు సీతమ్మ, రాజమ ఒకనాటి తన స్నేహితురాళ్ళు. పండేల కొని చెరువునించి నీళ్ళు మోసుకురావ నికీ, వెన్నెలో మొగ్గలాట ఆడుకో డుకు, గారెలు పంచుకోటానికీ, వో మార్చుకోనేందుకూ, గుళ్లో కొబ్బరిముక లకూ వాళ్ళు పిలుస్తున్నారు. వ నవ్వింది. వాగువిూద ఒంటి తాటి బొ ద్రిడ్జి ఏడ్చింది. చెలువు చేతులెత్తి సైగ చేసింది. పాత చీనితోట జాలిగా ఏ రమ్మన్నది. కాని రాములుకే మనసు లే

7

తోచక కూర్చొన్నది మాలచ్మి. రే మాసునై. నాగపూర్, డెరాడూన్ ? లైనుమీదబోయే రాములు గూడ్సు బం పోతున్నది. రేటు యీవల నుంచొన్న ముసిలా డెవరు? గొల్ల శేషు గాదూ?

"శేసు మామా! శేషు మామా"

ముసిలాడు చూసి ఒక్క గంతువేశా

"మా అమ్మ! మా అమ్మ!! మా ల న విక్కడున్నావా?" అని శేసుమా మాట దింపుకొన్నాడు. శేసుమామ రా శ్వరం బోతున్నాడంట.

ఆరాత్రి శేసు మామ చాలా పొద్దు యిందాకా "సుద్దులు" పాడాడు. "హ హరీనారాయణ అదినారాయణా, కరుణిం మమ్మేలు కమలలోచనుడా"— అని శే

నారసింహ లేహ్యము



బంగారు చేర్పబడినది. మే ము, నికొంక, నిస్సత్తువ, శు నష్టమును హరించి బలమును కాంతిని, వీర్యవృద్ధిని క గించు వరప్రసాదము—

20 తు॥ సీసా రు. 3-4-0 పోస్టేజి 12

పి. సి. ఏ. శ్రీకంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి- నెల్లూరు జిల్లా.

★ అమావాశ్య పున్నమి ★

మామ చెవుమీదకు చెయి బోనిచ్చుకొని ఆలాపన బాడి – సీతమ్మ వనవాసం – కథ చెప్పాడు. లోకంనిందలు బడలేక రాముల వారు సీతమ్మను అగ్నిప్రవేశం చెయ్యమంటం, అందులో ఆమె నెగ్గటం చివరకు భూదేవిని సీతమ్మ ప్రార్థించి తనకు దారి యిమ్మంటం, భూదేవి బీటలు వారగా అందులో సీతమ్మ మాయం గావటం.

మాలచ్మి ఏడ్చింది.

"ఎందుకే...?" అన్నాడు రాములు.

"మావూరు బంపించవా బావా? ఇద్దరం అడకళ్ళి సుఖపడదాం."

"ఊస్సు. ఆడేముంది? బూడిద."

మాలచ్మి ఏడవనూ లేదు. మాట్లాడనూ లేదు.

*   *   *

పొద్దున్నే శేసుమామ పయనంగట్టాడు. ఆరోజున ఎక్స్‌ప్రెసు కింద మనిషి బడి చస్తే, ఆ పనికి బోయినాడు రాములు. మాలచ్మి, మామను సాగనంపబోయింది.

"మాఁవా! సీతమ్మ పార్దనకు తల్లి బలికిందా?"

"ఘరి పలక్కుంటే జానికమ్మ భూమిలో కెట్టా బోయింది?"

శేసుమామ మాలచ్మి వంక వింతగా జూచాడు.

"ఇదుగో ఆ రైలుకింద బడితే, ఆ మనిసి...ఆమెను మాత్రం తల్లి గాదూ బిలిచింది? సీతమ్మతల్లి అనుమతిలేందే చీమైనా గుట్టదు."

"నిజం మావాఁ!"

"ఇక వుండు మా అమ్మ! మా లచ్మి! చాలాదూరం నడిచావు."

శేషమామ రామేశ్వరయాత్ర బోయినాడు.

*   *   *

మర్నాడు రాత్రి మెయిలు నిన్న ఎక్స్‌ప్రెసు ఆగినచోటనే ఆగిపోయింది.

"ఆడమనిషి...పాపం కుర్రది...... యిరవై ఏళ్లు గూడా లేవు" అన్నాడు లైటు వేసిన గార్డు.

"గేటుమన్‌ను పిలవండి."

ఇంతలోనే సిమెంటు ఫ్యాక్టరీ వాచిమెన్ వచ్చి, శవాన్ని చూసి "గేటుమేను పెళ్ళాం బాబూ" అని పెదిమ కరచుకొన్నాడు.

మాలచ్మికిదేమీ తెలియదు. తను భూదేవిని ప్రార్థించింది—భూదేవి బీటలువారి తనను ఐక్యం చేసుకొంటుందని. ★

★ లోకం తీరు ★

(10-వ పేజీ తరువాయి)

బోయిన బిందె అందుకుంటూ.

"అసలు మీ కోడలు పనిచేసే ఘటం కాదని చెప్పండి. మీవాడికి ముద్దు. ఆవిడ గారికి టెక్కు!—ఇక మీరు చాకిరీ చెయ్యక తప్పదని చెప్పండి. ఏదో ఇంటి గుట్టు కప్పాలని చూస్తున్నారు. కానీ నిజం మాకు తెలీకపోతుందా చెప్పండి." అందొకావిడ దీర్ఘాలుతీస్తూ.

"మీరంతా పొరబడుతున్నారు. నా కోడలు మీ రనుకుంటున్న రకం మనిషి కాదు. దాన్ని అర్థం చేసుకోడం కష్టం లెండి." అంటూ మెల్లగా కొళాయి వేపు అడుగు వెయ్యబోయిందె. తీరా నడక ప్రారంభించేసరికి ఆమెకు తెలిసింది తన కాలు ఇరుకెట్టిందన్న సంగతి.

ఈలోగా ఒకావిడ పనిపెట్టుకొని శీతమ్మ ఇంటికివెళ్లి, లోన పుస్తకం చదువుకుంటున్న లక్ష్మితో — "ఏవమ్మాయ్!— చక్కగా పుస్తకం చదువుకుంటున్నావు కాబోలు. వెళ్లు వెళ్లు!—మీ అత్తగారు నీళ్లు తెస్తూ పడిపోయేరు. ఏమయినా ముసలావిడ చేత చాకిరీ చేయించుకొనే సాహసికు రాలవ్!" అని చెప్పి వయ్యారంగా వెళిపోయింది.

చివుక్కుమంది లక్ష్మిహృదయం !— పుస్తకం ముడిచి వీధిలోకి పరుగెట్టింది. అత్తగారి దగ్గరకు ఆందోళనతో వెళ్లింది. "అమ్మో!—ఇదేమిటండీ!—ఎంతపని జరిగింది! నే తెస్తానంటే తేనివ్వరు!—దెబ్బ తగల్లేదు కదా?" అంది గబగబా వణుకుతూన్న స్వరంతో.

"ఏం ఫరవాలేదమ్మ. కాలు కొంచెం నొప్పెట్టింది. అంతే! ఓ క్షణం ఇలా కూర్చుంటే అదేపోతుంది. నువ్వు వెళ్లు." అంది శీతమ్మ కోడలు తలనిమురుతూ.

"ఇక్కడేమిటి? — మెల్లిగా లేవండి. నన్నానుకొని మెల్లగా నడవండి." అంది లక్ష్మి.

శీతమ్మ లేచింది. లక్ష్మి నానుకొని మెల్లగా కుంటుకుంటూ ఇంటికెళ్లిపోయింది.

అత్తగారిని దిగబెట్టేసేక లక్ష్మి కొళాయి దగ్గర కొచ్చింది నీళ్లు పట్టుకెళ్లడానికి. కాపరాని కొచ్చేక నీళ్లు పట్టుకెళ్ళడానికి కొళాయిదగ్గరకు రావడం, అది మూడో మారో, నాలుగో మారో!—

ఓ ముసలావిడ ముందుకొచ్చి లక్ష్మి ముఖంలోకి అదోలా చూస్తూ.. "ఔనమ్మా!—నీకెంత సిగ్గులేదే, ముసిలిముండ చేత చాకిరీ చేయించుకొంధికి!" అంది.

మరొకావిడ – "ఏమ్రోయ్! – ఈవిడ గారు నవీన నాగరికత కలమనిషి!—ఏమీ అనకండి. ప్రమాదం!...అత్తగారిచేత పని చేయించుకోడం ఈవిడగారి నాగరికత!" అంది.

కన్నీటిని అపుకోలేకపోయింది లక్ష్మి!—వాళ్ళంతా తన నలా ఎందుకంటున్నారో అర్థం చేసుకోలేకపోయిందామె. పుడుకు మోత్తనం హెచ్చయింది. సహించలేనంత కోపం వచ్చింది!—

ఇంకొకావిడ—"ఏవమ్మోయ్!—నాకు తెలీకడుగుతాను; నీమొగుడికి నీదగ్గర భయమనుకుంటాను..."అంది.

మరి సహించలేకపోయింది లక్ష్మి. "మీకెందుకూ నా ఊసు?—" అంది బొంగురు గొంతుకతో. ముఖం కందగడ్డలాగయింది. అప్రయత్నంగా కళ్లంట నీళ్లు కారేయి.

"మా ఇష్టం వచ్చినట్టు విమర్శిస్తాం!— మ ధ్యేవ త్రివిమధ్య?" అని సమాధానమిచ్చిందొకామె.

లక్ష్మిహృదయం బాగా గాయపడింది. ఎందుకు వాళ్లలా తనమీద ఊరికినే కత్తి కట్టేరో అర్థంకాలే దామెకు. తనేం తప్పు చేసిందిగనక?—ఉదారస్వభావంకలఅత్తకు కోడలవడమా తను చేసినతప్పు — బిందె నిండింది. కళ్లుకూడా నిండేయి నీళ్లతో!— అడుగులు తడబడుతూఉంటే బిందె భుజం మీద ఉంచుకొని ఇంటివేపు అడుగులేసింది లక్ష్మి. ఆమె వెళిపోతూఉంటే, కొళాయి దగ్గర మూగిన అమ్మలక్కలు నానారకాలుగానూ అన్నారు.

లోకులు తనగురించి ఇష్టాన్లొయి విమర్శకుంటున్నారో లక్ష్మికి అనాడే తెలిసింది!—ఆమె మనస్సు వికలమయిపోయింది. తను సుఖంగా ఉండడం లోకుల కంత కష్టంగా ఎందుకుందో అర్థంకాలే దామెకు!—

నిజానికి లోకులు విమర్శించుతున్నట్టుగా, తను అత్తగారిని బాధలు పెడుతున్నదా?—లేదే!—ఆమెకు తనెన్నడూ కష్టం కల్గించలేదే!—కానీ ఒకవేళ తనకు తెలీకుండా తనవల్లామెకు కష్టం కలుగుతున్నదా? పైకి తనముందేమీ అనకుండా లోలోన క్రుళ్లుతూ లోకులముందు తన గురించి చెడ్డగా అత్తగారు ఇష్టాన్లొయి చెప్పుకుంటున్నదా?...లక్ష్మి మనస్సు తీవ్ర